## సర్పంచును కాదని జెండా ఎగురవేసిన కార్యదర్శి

- అవమానపరిచారంటూ కలెక్టర్ కు సర్పంచ్ ఫిర్యాదు
- చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తాం: బీజేపీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మెట్పల్లి గ్రామ పంచాయతీలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సర్పంచ్ ను కాదని పంచాయతీ కార్యదర్శి జెండా ఎగురవేయడం వివాదానికి దారితీసింది. తనను కాదని కార్యదర్శి సరిత జెండా ఎగురవేసి అవమానపరిచారని సర్పంచ్ కొయ్యడ కుమార్ యాదవ్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఇతర గ్రామాల్లో సర్పంచ్లే జెండా ఎగురవేస్తున్నారని చెప్పినా వినలేదని, సూర్యాస్తమయం కాకముందే జెండాను దించి అవమానించారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి స్పందిస్తూ.. సర్పంచ్ కు ప్రోటోకాల్ ప్రకారం గౌరవం ఇవ్వని కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, నాయకులు జగ్గారెడ్డి, శ్రీనివాస్ రాస మల్ల శ్రీనివాస్ గద్దపాక ఉప సర్పంచ్ సర్పంచ్ జంగా జైపాల్,ఎల్కపల్లి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## మంజులకు 'స్వర్ణనంది' పురస్కారం

- హైదరాబాద్ లో ఆల్ ఇన్ వన్ టాలెంట్ అవార్డుల ప్రదానం
- గాయనిగా మంజుల ప్రతిభకు గుర్తింపు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



మండలంలోని అంబాలాపూర్ గ్రామానికి చెందిన జక్కి మంజుల ప్రతిష్ఠాత్మక 'స్వర్ణ నంది' అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్ లో నిర్వహించిన 'ఆల్ ఇన్ వన్ టాలెంట్ అవార్డ్స్-2026' వేడుకల్లో ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. చిన్నతనం నుంచే గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మంజుల ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, యాంకర్ సమీర్ చేతుల మీదుగా ఆమె అవార్డు స్వీకరించారు. మంజుల సాధించిన ఈ విజయ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులకు స్నేహిత అవగాహన సదస్సు

- సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన
- సోషల్ మీడియా, డ్రగ్స్ దుష్ప్రభావాలపై హెచ్చరిక
- సమస్యలు ఎదురైతే 1098 నంబర్ కు పిర్యాదు చేయాలని సూచన

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని కన్నాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం 'స్నేహిత' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ శ్వేత, ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ, మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల జరుగుతున్న అకృత్యాల నేపథ్యంలో సేఫ్ టచ్ - అన్ సేఫ్ టచ్ మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098ను ఎలా సంప్రదించాలో వివరించారు. సోషల్ మీడియాపై అప్రమత్తత ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వినియోగం వల్ల కలిగే అనర్థాలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు సులభమైన రీతిలో వివరించారు. స్వీయ రక్షణ పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాహారం ఎంతో అవసరమని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఏఎన్ఎం, వివో సభ్యులు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## జాతర విధులకు ఏడు క్లస్టర్లు

- అధికారులు, సిబ్బందికి విధులపై అవగాహన
- భక్తులకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్యం, నీటి సౌకర్యం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** కేశవపట్నంలో జరగనున్న సమ్మక్క-సారక్క జాతర నిర్వహణ కోసం అధికారులను ఏడు క్లస్టర్లుగా విభజించారు. మంగళవారం స్థానిక అధికారులతో నిర్వహించిన సమావేశంలో జాతర విధులకు కేటాయించిన జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లకు వారి బాధ్యతలపై అవగాహన కల్పించారు. బస్టాండ్ నుండి గద్దెల వరకు, గ్రామ పం చాయతీ నుండి మోడల్ స్కూల్ వరకు ఉన్న ప్రాంతాలను క్లస్ట ర్లుగా విభజించారు. ప్రతి క్లస్టర్ కు ఒక జీపీఓ, కార్యదర్శి, కరోబార్, మల్టీపర్పస్ వర్కర్లను కేటాయించారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలలో ఎటువంటి లోటు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సురేఖ, డిప్యూటీ తాసిల్దార్ ఖాదర్, ఎంపీడీఓ, కృష్ణ ప్రసాద్ జాతర చైర్మన్, గుర్రం స్వామి,ఈఓ, మారుతి రావు సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు

## మున్సిపల్‌కు ఎన్నికల నగారా..

- 28 నుంచి నామినేషన్లు
- షెడ్యూల్ విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి
- ఫిబ్రవరి 11న పోలింగ్.. 13న కౌంటింగ్
- ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రాష్ట్రంలో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల కార్యచరణ విడుదలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక తేదీలను వెల్లడించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిశాక పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా వెలువరిస్తామన్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని వివరించారు. మంచిర్యాల కార్పొరేషన్ అభ్యర్థుల కోసం నస్పూర్ కలెక్టరేట్ లో, లక్షెట్టిపేట అభ్యర్థుల కోసం పాత ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాతనపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్ అభ్యర్థులు ఆయా మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్లు సమర్పించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్ లో 08736-250501 నంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదుదారుల వివరా లు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అధి కారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను పారదర్శ కంగా, ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

## క్యాతనపల్లి మున్సిపల్ పీఠంపై ఆశావహుల కన్ను

- బరిలో నిలిచేందుకు ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా
- పాత వారికే ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యేకు విన్నపం
- క్యాడర్ లో మొదలైన అసంతృప్తి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ రిజర్వేషన్ 'జనరల్ మహిళ'గా ఖరారు కావడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అటు అధికార కాంగ్రెస్ తో పాటు ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్ లోనూ ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా బీఆర్ఎస్ కు చెందిన ఒక కీలక నాయకుడు తన భార్యను మున్సిపల్ పీఠంపై కూర్చోబెట్టేందుకు వ్యూహ రచన చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న ఆమెతో రాజీనామా చేయించి, ఎస్సీ మహిళా రిజర్వేషన్ ఉన్న వార్డు నుం డి బరిలోకి దింపేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

**నమ్మిన వారిలో ఆవేదన**

ఈ పరిణామాలపై గత పదేళ్లుగా పార్టీని నమ్ముకుని ఆ వార్డులో పనిచేస్తున్న స్థానిక నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కొత్తవారిని తీసుకువచ్చి టికెట్లు ఇవ్వడం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన తమను కాదని, వేరే వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వవద్దంటూ సదరు నాయకులు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను కలిసి మొరపెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో పట్టున్న తమకే అవకాశం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



- పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఎన్నికల కమిషనర్ ఆదేశం
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- మంచిర్యాల జిల్లాలో 5 పురపాలక సంఘాలకు ఏర్పాట్లు పూర్తి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు ఏర్పాట్లు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ (60 డివిజన్లు), బెల్లంపల్లి (34 వార్డులు), చెన్నూర్ (18), క్యాతనపల్లి (22), లక్షెట్టిపేట (15) మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారుల నియామకం, సిబ్బందికి శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అందరి సమన్వయంతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- శ్రీరాంపూర్ జీఎంకు సమ్మె నోటీసు అందజేసిన సిఐటియు
- కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌కు బ్రాంచ్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను మానుకోవాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియా బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకూడదని, కమర్షియల్ మైనింగ్‌ను వెంటనే రద్దు చేయాలని నాయకులు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక విధానాలను ఆపాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయడం సరికాదని, ఈ విధానాలకు అడ్డుకట్ట వేయడానికే అన్ని కార్మిక సంఘాల ఐక్య వేదికతో సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ నాయకులు శ్రీపతి బానిష్, సాయిల శ్రీనివాస్, తుమ్మల కిషన్ రెడ్డి, తోడే సుధాకర్, నూనెటి శ్రీనివాస్, పోలు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పారువెల్ల లక్ష్మీ గణపతి వార్షికోత్సవాలు ప్రారంభం



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలోని లక్ష్మీ గణపతి దేవాలయంలో 15వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని పూల తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి శోభాయమానంగా మార్చారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో తొలి రోజున గణపతి పూజ, ధ్వజారోహణం, గోపూజ, మూలమూర్తికి అభిషేకం, నవకలశ పూజ, స్వప్నం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది భక్తులు లక్ష్మీ గణపతి స్వామిని దర్శించుకున్నారు. వేడుకల అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పారువెల్ల గ్రామ ప్రజలు ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కాచాపూర్ లో నిఘా నేత్రాలు ప్రారంభం



- గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- సుమారు ₹40 వేల వ్యయంతో భద్రత కల్పన
- నేరాల నియంత్రణే లక్ష్యమన్న ప్రజా ప్రతినిధులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

మండలంలోని కాచాపూర్ గ్రామపంచాయతీలో భద్రతను పటిష్టం చేసే దిశగా అడుగులు పడ్డాయి. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. సుమారు 40 వేల రూపాయల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తుల రక్షణ కోసం మరియు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ నిఘా నేత్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి వీధిలో నిఘా ఉండటం వల్ల దొంగతనాలు తగ్గుతాయని, ప్రజలు భయం లేకుండా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## 'కొత్తపల్లిలో ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపాలి'



- బీజేపీ రాష్ట్రనాయకుడు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి పట్టణంలో ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపాలని బీజేపీ రాష్ట్రనాయకుడు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్ కోరారు. కొత్తపల్లి పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులను ఆదేశించినప్పటికీ బస్సులు ఆపడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సులు ఆపేలా డ్రైవర్లకు ఆదేశాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వర్గం నర్సయ్య, చిట్కూరి శ్రీనివాస్, కారం రవిప్రసాద్ పాల్గొన్నారు.

